క్లుప్తంగా

పోరంబోకు భూమిని పంచాయతీకి అప్పగించాలి



తహసీల్దార్ మునివేలుకి వినతి పత్రం అందిస్తున్న హరేసముద్రం గ్రామస్తులు

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రంలో సర్వే నంబర్ 271–ఏలో ప్రభుత్వ పోరంబోకు నాలుగు ఎకరాల భూమిని పంచాయతీ పేరున ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ మునివేలుకు గ్రామస్తులు గురువారం విన్నవించారు. వారు మాట్లాడుతూ హరేసముద్రం శివారులోని గ్రామానికి నీటి సరఫరా కోసం బోర్లు వేసి, ట్యాంకు ఏర్పాటు చేశారన్నారు. ట్యాంకు చుట్టూ ఉన్న పొలాల్లో క్రిమి సంహారక మందులు వాడడం వల్ల రసాయనిక మందులతో నీరు కలుషితమవుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి, గ్రామస్తులు తిప్పేస్వామి, శ్రీనివాసులు, దివాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళి



ఆర్థికసాయం అందిస్తున్న మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి

బ్రహ్మసముద్రం : పాలవెంకటాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వన్నూరప్ప (60) ఆకస్మికంగా మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు వన్నూరప్ప మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వన్నూరప్ప కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివన్న, నాగరాజు, బసిరెడ్డి, బోయ రామన్న, సంతోష్, నటరాజ్, హనుమంత, రాజప్ప పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ 'మిత్ర' కిట్లు అందించాలి



కూడేరు : గొటుకూరులో మిత్ర కిట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు సాయి

కూడేరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు అందించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు సాయి మండల విద్యాధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన గొటుకూరు ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. మిత్ర కిట్‌లోని పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, బెల్టులు, షూస్, బ్యాగులు, యూనిఫాం అందాయా? అని విద్యార్థులతో ఆరా తీశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు–1,2 మహమ్మద్ గౌస్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని ఎంఈఓలు మల్లికార్జున, ఈరన్న అన్నారు. బదిలీపై వెళ్తున్న దేవగిరి క్రాస్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యు లు రామలింగాదేవి, పద్మజలకు గురువారం వీ డ్కోలు సభ ఏర్పాటు చేశారు. సర్పంచ్ కోటేశ్వర రెడ్డి, శీన, సీఆర్పీలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలి



లేఖను చూపుతున్న బంజారా సేవా సంఘ్ నాయకులు

ఉరవకొండ: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ను రెన్యూవల్ చేయాలని కోరుతూ వజ్రకరూరుకు చెందిన అఖిల భారత బంజారా సేవా సంఘ్ జాతీయ నేత ఎస్‌కే కేశవనాయక్ భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్ముకు గురువారం ఫ్యాక్స్ ద్వారా లేఖ పంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేలా ఫాదర్ ఫెరర్ ఆర్‌డీటీను స్థాపించారన్నారు. అలాంటి సంస్థకు కేంద్రం ఇప్పటి వరకు ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయకపోవడం బాధాకరమన్నారు.

28న మెగా జాబ్ మేళా

రాయదుర్గంటౌన్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 28న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదికి పైగా నేషనల్, మల్టీ నేషనల్ కంపెనీ ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ అర్హత ఉన్న అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరుకావొచ్చన్నారు. మరింత సమాచారం కోసం 9182920381 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఈ నెల 15న రాయదుర్గంలోని భగత్‌సింగ్ కాలనీలో వీధికుక్కలు బీభత్సం సృష్టించాయి. అదే కాలనీకి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు ఈశ్వరమ్మ నడిచి వెళ్తుండగా, కుక్కల గుంపు చుట్టుముట్టి ముప్పేట దాడి చేశాయి. స్థానికులు కర్రలతో అదిలించినా ..వదలలేదు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని ఆస్పత్రిలో చేర్పించారు.



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

రాయదుర్గంలోని శాంతినగర్‌లో రెండు రోజుల క్రితం పాఠశాల నుంచి ఇంటివెళ్తున్న ఇద్దరు పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. ఇద్దరికీ గాయాలయ్యాయి. పుస్తకాల సంచి పడేసి అరుస్తూ పరుగులు పెట్టారు. స్థానికులు కుక్కల నుంచి రక్షించి వారిని ఇంటికి చేర్చారు. ఇలా.. ఈ రెండు చోట్లే కాదు.. కుక్క కాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. నియంత్రించాల్సిన అధికారులు ఇసుమంతైనా చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వామ్మో..పిక్కలు పీకేస్తున్నాయ్!

- వీధుల్లోకి వెళ్లాలంటేనే భయం .. భయం
- వణికిస్తున్న గ్రామ సింహాలు
- ఐదు నెలల్లో 2,279 కేసులు
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వీధికుక్కల స్వైర విహారం ఆగడంలేదు. రోజూ ఏదో ఒక వీధిలో, ఎవరో ఒకరు కుక్కకాటుకు గురవుతూనే ఉన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం పురపాలక సంఘం పరిధిలో 1,617, ఉరవకొండ పట్టణంలో 609 కుక్కలకు కు.ని నిర్వహించాలని ఇటీవల మున్సిపల్ అధికారులు గుర్తించారు. వీటికి తోడు గ్రామీణ ప్రాంతాల్లోని వీధి, పెంపుడు కుక్కలు సుమారు లక్షకు పైగా ఉన్నాయి. పిచ్చి కుక్కలు వీధుల్లో గుంపులుగా తిరుగుతూ మనుషులతో పాటు జంతువులపై దాడి చేస్తున్నాయి. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అనే తేడా లేకుండా వీధుల్లో నడిచి వెళ్లినా, వాహనాల్లో వెళ్లినా దాడి చేసేస్తున్నాయి. రోజూ ఆస్పత్రుల్లో 12 నుంచి 15 కుక్కకాటు బాధిత కేసులు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. ఐదు నెలల్లోనే మూడు నియోజకవర్గాల్లో 2,279 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా రాయదుర్గం నియోజకవర్గంలోని పట్టణం, ఆయా మండలాల్లో 1469 కుక్కకాటుకు గురయ్యారు.

బెంబేలెత్తున్న ప్రజలు

మూడు నియోజకవర్గాల్లోనూ పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కల సంతతి గణనీయంగా పెరిగింది. వర్షాకాలం ప్రారంభమైనా రేబిస్ టీకా వేయడం లేదు. దీంతో వర్షంలో తడిసిన కుక్కలు పిచ్చిపట్టినట్టు దాడులు చేస్తున్నాయి. కుక్కల దాడి నుంచి తప్పించుకునేందుకు పెద్దలు శతవిధాల ప్రయత్నిస్తారు. చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంది. మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద వ్యర్థాల వద్ద కుక్కల గుంపు ఎక్కువగా ఉంటోంది. పెంపుడు కుక్కలు, పురపాలక, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో టీకా వేయించాలని ప్రజలు కోరుతున్నారు.



కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు

కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు



కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు చేపట్టాం. కుక్కల సంతతి నియంత్రణ, శస్త్రచికిత్సల కోసం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తీసుకున్నాం. ఆ నివేదికలు కూడా పంపించాం. త్వరలో ఈ ప్రక్రియ మొదలు పెట్టే అవకాశం ఉంది. వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజల్ని చైతన్యం చేస్తాం. గుంపుగా ఉండే కుక్కల్ని వేరే చోట వదిలిపెట్టేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

కుక్కకాటును నిర్లక్ష్యం చేయొద్దు



కుక్కకాటును నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం తప్పదు. కుక్క కాటుకు తక్షణం సమీప ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స చేయించుకొని టీకా పొందాలి. ఇటీవల కుక్కల బెడద అధికమైంది. తరచూ కేసులు వస్తున్నాయి. బాధితులు టీకా తీసుకుంటే ఉపశమనం పొందొచ్చు. 3, 7, 28 రోజుల్లో టీకా తప్పకుండా తీసుకోవాలి.

– మెర్సీ జ్ఞానసుధ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

బోర్డులో సమాచారం మార్చారు

సాక్షి ఎఫెక్ట్..



మున్సిపల్ కార్యాలయ సమాచార బోర్డులో మార్పు చేసిన సమాచారం

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ కార్యాలయాల్లోని సమాచార హక్కు బోర్డులో సమాచారాన్ని మార్చారు. గురువారం 'సాక్షి'లో 'సమాచారం.. అపహాస్యం' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు గురువారం ఉదయమే కార్యాలయ బోర్డులో అధికారుల పేర్లను అప్‌డేట్ చేశారు.

మున్సిపల్ స్థలాలను పరిరక్షించండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని గాంధీ చౌక్‌లో ప్రధాని రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోని షాపులను ఏర్పాటు చేసిన వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపాల్ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. అధికారులు టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారన్నారు. పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మున్సిపాలిటీ స్థలం కబ్జా చేసి, రాత్రికి రాత్రే టీడీపీ నాయకులు షాపులు ఏర్పాటు చేశారన్నారు. పట్టణంలోని ప్రధాన సర్కిల్లో విలువైన ప్రభుత్వ స్థలాలన్నీ కబ్జాకు గురవుతున్నాయని, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపల్ ఆస్తులు కబ్జాకు గురైతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ సుధీర్, కౌన్సిలర్ పరమేశ్వర్, మండల కన్వీనర్ గోళ్ల సూరి నాయకులు బిక్కిహరి, మురళి, శ్రీకాంత్, జాకీర్, చరణ్, వెంకటేశులు, గుబనపల్లి నాగరాజు, హేళ్లా, టైలర్ శీనా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యులు బదిలీ

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యులు బాలాజీనాయక్ సత్యసాయి జిల్లా ఎన్‌పీకుంటకు బదిలీపై వెళ్లారు. సీహెచ్‌ఓ మురళీధర్ అన్నమయ్య జిల్లా రాయచోటికి, సీనియర్ అసిస్టెంట్ హేమలత కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు



రహదారికి అడ్డంగా పెరిగిన కంపచెట్లు

ఉరవకొండ రూరల్: ఉరవకొండ నుంచి వెలిగొండకు ప్రధానమార్గంలో రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు అడ్డంగా ఏపుగా పెరిగాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. మలుపుల వద్ద మరింత ప్రమాదకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ముఖ్యనేతలు

ఉరవకొండ: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకులు ఏసీ ఎర్రిస్వామి, బసవరాజు, ఓబన్న తెలిపారు. గురువారం ఉరవకొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి పార్టీ ముఖ్యనేతలు మాట్లాడుతూ జూలై 2న ఉరవకొండలోని గవిమఠం వెనుక వైపు ఉన్న వీరశైవ కళ్యాణ మంటపంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల రూరల్ కన్వీనర్ ఎర్రిస్వామిరెడ్డి, బీసీ సెల్ జిల్లా నాయకులు లత్తవరం గోవిందు, కమ్మటి రామాంజనేయులు, వేమన్న, చిన్న భీమా, అంగదాల అంజి, వడ్డే ఆంజనేయులు, ఓబన్న, భీమా, సతీష్, తన్వీర్, జోగి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

ఉరవకొండ రూరల్: నట్టల నివారణ మందుతో మూగజీవాల్లో వ్యాధి నిరోధకత పెరుగుతుందని ఏడీ పెద్దన్న పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ పరిధిలో 18 వేల గొర్రెలు, 13 వందల మేకలకు మందును పంపిణీ చేసినట్లు ఏడీ తెలిపారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఈ మందు తాగించటం ద్వారా గొర్రెలు, మేకల మరణాలు తగ్గి జీవాల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆమిద్యాల పశు వైద్యాధికారిణి శ్రీవిద్య, ఆమిద్యాల పశు వైద్య సిబ్బంది, గ్రామ పరిధిలోని గొర్రెల కాపరులు పాల్గొన్నారు.



నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఏడీ పెద్దన్న

చోళసముద్రం పశువైద్యాధికారిగా తులసీరామిరెడ్డి

కూడేరు: మండలంలోని చోళసముద్రం పశు వైద్యాధికారిగా తులసీరామిరెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన గురువారం పశువైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆత్మకూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న పశువైద్యాధికారిణి శ్వేతా చియ్యేడుకు బదిలీపై వెళ్లారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతూ వివాహిత మృతి

బొమ్మనహాళ్: మండల కేంద్రానికి చెందిన పూజ అనే వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన మేరకు కర్ణాటకలోని కుడితిని గ్రామానికి చెందిన పూజ, రాజేష్ దంపతులు బతుకుదెరువు కోసం బొమ్మనహాళ్‌కు వచ్చారు. అద్దె ఇంట్లో ఉంటూ గ్రామాల్లో సిల్వర్ సామాన్లు విక్రయించి, జీవనం సాగించేవారు. పూజ అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల 19న దోమలకు పిచికారీ చేసే మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పండ్ల మొక్కల కోసం దరఖాస్తు చేసుకోండి

కూడేరు: మండలంలో 2025–26 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ కింద పండ్లమొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ పోలేరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నసన్న కారు రైతులు మామిడి, సీతాఫలం, బత్తాయి, జామ, అల్లనేరేడు, అంజూరతో పాటు మరికొన్ని పండ్ల మొక్కలు పెంచుకోవచ్చన్నారు. రైతులు జూలై 7 వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ

కూడేరు: స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జైభీమ్ రావ్ భారత్ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షుడు రామప్ప నాయక్ ఆధ్వర్యంలో గురువారం నోట్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేశులు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవీంద్రకుమార్

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ (ఐటీఐ) కళాశాల ప్రిన్సిపాల్‌గా రవీంద్రకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ప్రిన్సిపాల్ నాగరాజు కర్నూలు ఐటీఐ కళాశాలకు బదిలీపై వెళ్లగా, అదే స్థానంలో ఉన్న రవీంద్రకుమార్ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి







రాయదుర్గంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం , కళ్యాణదుర్గంలో ర్యాలీ చేస్తున్న డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు , ఉరవకొండలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకళ్యాణి

రాయదుర్గం: విద్యార్థులు నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని 74 ఉడేగోళం సమీపంలోని కేటీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎస్‌ఐలు పవన్‌కుమార్, దామోదర్, ఎక్సైజ్ సిబ్బందితో కలసి అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులతో కలసి సీఐ మాట్లాడారు. విద్యార్థుల దృష్టి జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలో ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ చేశారు. ఎక్సైజ్‌శాఖ, ఐసీడీఎస్, మున్సిపల్‌శాఖ, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ కొండన్న, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, కౌన్సిలర్లు హాజరయ్యారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి లక్ష్మీబజార్, పాతబస్టాండ్ మీదుగా వినాయక సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

కళ్యాణదుర్గం రూరల్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఆర్‌డీఓ వసంత్‌బాబు, డీఎస్పీ రవిబాబు సూచించారు. గురువారం పట్టణంలోని డిగ్రీ కాలేజ్, పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసవుతూ జీవితాలను బుగ్గి చేసుకుంటోందన్నారు. యువత ఉన్నత చదువులపై దృష్టి పెట్టి, ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం అనంతరం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యం ముద్దు అంటూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత, రెవెన్యూ, పోలీస్, కళాశాల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దాస్, ఎంఈఓలు ఈరన్న, మల్లికార్జున, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరు: స్థానిక హైస్కూల్‌లో మత్తు పదార్థాల వాడకం– అనర్థాలు అనే అంశంపై సీఐ రాజు ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తొలుత అధికారులు విద్యార్థులతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, సీడీపీఓ శ్రీదేవి, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఎం దేవానంద ఫిలిప్పన్, హెచ్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

ఉరవకొండ: ప్రమాదకర మత్తు పదార్థాల జోలికి యువత, విద్యార్థులు వెళ్లరాదని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, లీగల్ సెల్ అథారిటి చైర్‌పర్సన్ దుర్గాకళ్యాణి సూచించారు. గురువారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాలలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి దుర్గా కళ్యాణి హాజరై మాట్లాడారు. కుటుంబంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పిల్లల ముందే మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల పిల్లలు వాటికి ఆకర్షితులవుతున్నారన్నారు. మత్తులో మహిళలు, చిన్నారులపై అఘాత్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కళాశాలల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ లాంటివి అధికంగా జరుగుతున్నాయన్నారు.

కణేకల్లు: మత్తుపదార్థాలకు యువకులు, విద్యార్థులు దూరంగా ఉండాలని తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎక్సైజ్ సీఐ ఉమాబాయి పేర్కొన్నారు. గురువారం కణేకల్లులో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఎక్సైజ్ ఎస్ఐ షేక్షావలి, ఎక్సైజ్, సివిల్ పోలీసులు, కాలేజీ సిబ్బంది ర్యాలీ చేశారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో జాతీయ మారక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్‌రోడ్ మీదుగా మహాత్మా గాంధీ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ చేశారు. ఎస్ఐ నాగస్వామి మాట్లాడారు.

గుమ్మఘట్ట: మత్తు పదార్థాల జోలికి యువతీ, యువకులు వెళ్లరాదని తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. గురువారం గ్రామంలో మత్తు పదార్థాల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ రూరల్: మండలం పరిధిలోని రాకెట్ల పీహెచ్సీ పరిధిలోని ఆమిద్యాలలో ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు పావని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామానికి చెందిన పదోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు.

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని గడేహోతూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మారుతీ గురువారం తెలిపారు. ఈనెల 30లోపు దరఖాస్తు అందించాలన్నారు.

విద్యార్థి అదృశ్యం

బ్రహ్మసముద్రం : మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన సాత్విక్ అనే విద్యార్థి కనిపించలేదని అతని తండ్రి మీనేష్ స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. సాత్విక్ పట్టణంలోని గోల్డెన్ బెల్స్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. విద్యార్థి ఆచూకీ తెలిస్తే సెల్: 9704089855లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.